కథానిక

"అత్తయ్యా! అత్తయ్యా!" అంటూ తలుపు తట్టాను.

గాజుల గలగల, ఆ వెంటనే ఎవరో లేచి వస్తున్న అడుగుల సవ్వడి. తలుపులు తెరవబడినాయి. లోపలికి అడుగు పెట్టబోతున్న వాణ్ణి స్తంభించిపోయి గడపలోనే అలా నిలబడిపోయాను.

కోలమొహం, కలువరేకుల బోలు కనులు, తామర మొగ్గలను జ్ఞప్తికి తెచ్చే అధరాల్లు, సంపెంగలా

# మల్లీశ్వరి

— జి.సి.జీవి



తీర్చిదిద్దినట్లున్న ముక్కు - ఇత్యాది ఇదివరకు ఎందరో ఎన్నిసార్లో వర్ణించిన స్త్రీ సౌందర్యం. అయినా ప్రత్యేకించి నాకు గోచరించిన, ఏదో నవ్యతతో నా ముందు నిలబడిఉన్న ఇరవై ఏళ్ళు దాటని ఆ యువతిని చూస్తూ ఎన్ని నిమిషాలు అలా నిలబడ్డానో జ్ఞాపకం లేదు. పొరపాటు గ్రహించి, తేరుకుని చూపులు మరల్చి ఏదో చెప్పబోయాను. సరిగ్గా అదే పరిస్థితి లోంచి మేల్కొన్న ఆమె, "మీరెవరు?" అన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది నా వేపు.

"చూడండీ! అత్తయ్య ఉందా?" అన్నాను సాధ్యమైనంత వరకు ఆమెపై నుంచి చూపులు తిప్పడానికి ప్రయత్నిస్తూ.

"ఏ అత్తయ్య? ఎవరి అత్తయ్య?" కటువుగా ప్రశ్నలు ఒకదాని వెంట ఒకటి.

"ఆ...అదే...మా అత్తయ్య."

"మీ అత్తయ్యలు ఇక్కడెందు కుంటారు?" నవ్వు ఆపుకుంటూ వెటకారంగా అన్న మాటలు! అప్పుడు కనిపించిన ముత్యాల వరస — ఆహా — పలువరస.

"క్షమించాలి. నేను మా అత్తయ్య, అంటే సుభద్రమ్మగారిని చూడాలి." ఎంత ప్రయత్నించినా మాటలు తడబడ్డాయి.

"అయితే మీ రెవరో చెప్పండి ముందు." ఆజ్ఞ.

"నేను...మీకు తెలీదులెండి. మా అత్తయ్య...."

"ఆవండి. నాకు తెలీకుండా ఈ ఇంట్లో ఏదీ జరగదు! జరగడానికి వీల్లేదు!"

ఆ మధ్య చూసిన ఏదో తెలుగు సినిమాలో ముద్దాయిని విడుదల చేయడానికి ఎంతమాత్రం వీల్లేదు అని బ్రహ్మాండంగా వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ చివరి డైలాగు జ్ఞాపకం వచ్చింది.

"ఎవరే, అమ్మాయి, అది? మళ్లీ ఎవరితోటి ఆ ఘర్షణ?" మెట్లు దిగి హాల్లోకి వస్తున్న అత్తయ్య మాటలు వినిపించాయి.

"అత్తయ్యా!" ఆపద్బాంధవిలా వస్తున్న అత్తయ్యను చూసి మహదానందంతో పిలిచాను.

"ఎవరూ?" కళ్లజోడు సవరించుకుని నన్ను పరీక్షగా చూసి, "ఓరే! నువ్వట్రా, నాగూ! ఎన్నాళ్లకి వచ్చావురా! నిన్ననే వస్తున్నట్టు టెలిగ్రాం ఇచ్చి ఈ రోజా రావటం?" ప్రశ్నల వర్షం కురిపిస్తూ ఆప్యాయంగా హాల్లోకి నడిపించుకుపోయింది అత్తయ్య. అత్తయ్య నా పేరు ఉచ్చరించగానే ఆ అమ్మాయి గిరుక్కున తిరిగి విసవిసా నడిచి హాల్లో ఓ మూలగా రోజ్‌ఉడ్ టేబిల్‌మీద అమర్చిన రేడియో ట్యూన్ చేసి నిర్లక్ష్యంగా ఏదో ఇంగ్లీషు పత్రిక తిరగేస్తూ కూర్చుని ఉండడాన్ని ఓ కంట కనిపెడుతూనే ఉన్నాను.

"అమ్మాయ్, మల్లీ! ఏమిటే నీ ప్రవర్తన? రాకరాక పదిహేనేళ్ల తరవాత బావ వస్తే పలకరింపు కూడా లేకుండా ఆ మూలకి వెళ్లి కూర్చున్నావేమిటి?"

## ఈ కథ ఎందుకు

ఒక చిన్న సంఘటన చాలు జీవితాన్ని దారిమళ్ళించటానికి. ఆ సంఘటన తానే సృష్టించుకుంటే.. అలాంటి కోవకుచెందినదే మల్లి. ప్రతి వ్యక్తిలోనూ ద్వంద్వ స్వభావం వుండడం సహజం. రచయిత అయిన తన బావలో కూడా అలాంటి స్వభావం వుందా అని తెలుసుకోడానికి తమాషాకో అహంకారంతోనో, ఆమె చేసిన ఆ పరీక్ష చివరికి ఆమె పాలిటి అగ్నిపరీక్షగా పరిణమించింది. ఇతివృత్తం, పరిధి చిన్నదే అయినా, వ్యక్తుల మనస్తత్వాలకి పరీక్షగా నిలిచే కథ - 'మల్లీశ్వరి'. జి.సి. జీవిగా పాఠకులకు పరిచితులైన జి. చిరంజీవి రాసిన ఈ రచన ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక (5-10-'66)లో ప్రచురితమైంది.

మల్లిని మందలిస్తున్నట్లు అన్నది అత్తయ్య.

'ఆ మర్యాదలన్నీ ఇందాకనే జరిగాయిగా' అనుకున్నాను మనస్సులో.

"చూడు, నాగూ! నువ్వు మరోలా అనుకోకు. అది కాస్త మొండిఘటం. అతి గారాబంతో దాన్ని అలాచేసి పోయా రాయన" అంటూ కళ్లద్దాలు పైకెత్తి చీరకొంగుతో కళ్లు తుడుచుకుంది అత్తయ్య. అప్రయత్నంగా నా దృష్టి ఎదురుగా గోడకు తగిలించిన మామగారి ఫోటో మీదికి మరలింది.

పదిహేనేళ్ల క్రితం ఏదో చిన్న విషయానికి మామయ్యతో ఘర్షణపడి ఇల్లు వదిలి పారిపోయాను. తెలిసీ తెలియని ఆ ప్రాయం అలాంటిది. తలిదండ్రులను కోల్పోయిన నన్ను చేరదీసి, ఆ కొరత మరిపించిన అత్తయ్యకూ, మామయ్యకూ దూరమైనాను. తరవాత ప్రత్యక్ష జీవితం నేర్పిన పాఠాలు చదివి, ఆనాడు తెలివి తక్కువగా ప్రవర్తించానని తెలుసుకోగలిగాను. పశ్చాత్తాపం అనుభవించాను. మామయ్య కాళ్ల మీద పడి క్షమాపణ కోరుకుంటేగాని నా ఆత్మకు శాంతి ఉండబోదని గ్రహింపు కలిగింది. కాని, నాకా అవకాశం ఇవ్వకుండానే మామయ్య పోయాడు. ఆమధ్య మామయ్య గుండెజబ్బుతో చనిపోయాడని తెలిసింది.

"మల్లీ! ఆ పెంకితనం ఇక చాలించి వచ్చి కూర్చుని బావతో మాట్లాడుతూ ఉండు. నే నిప్పుడే వస్తాను" అని హాల్లోంచి వంట గదిలోకి కామోసు వెళ్లింది అత్తయ్య.

నా వేపు కొంటెగా చూసి రేడియో దగ్గరినుంచి లేచి వచ్చి సోఫాలో నాకు ఎదురుగా కూర్చుంది మల్లి.

"అయితే, బావగారూ, తమరితో ఏం మాట్లాడాలో సెలవియ్యండి." నవ్వు ఆపుకుంటూ ఆమె అన్నమాటలకు వెంటనే ఏం చెప్పాలో తోచింది కాదు నాకు.

నేను వ్రాసే కథల్లో ఇటువంటి సన్నివేశాల నెన్నింటినో అతి చాకచక్యంతో చిత్రించి ఉన్నాను. హీరో చేత సరసంగానూ, చమత్కారంగానూ సంభాషణలు జరిపించడంలో నేను సిద్ధహస్తుణ్ణని అంటూంటారు నా మిత్రులు. కాని, కేవలం ఊహావిహారినైన నేను ఈ వాస్తవిక సంఘటనలో ఓడిపోయాననే చెప్పాలి.

"ఏం చదువుతున్నావు?" ఆ చచ్చు ప్రశ్న తప్ప మరేదీ తోచలేదు నాకు.

"ఇలస్ట్రేటెడ్ వీక్లీ" అని నవ్వు ఆపుకోవడానికి పమిటచెంగు నోటికి అడ్డం పెట్టుకుంది మల్లి.

"ఆహా...అది కాదు. బి.ఎ.ఆ, బి.ఎస్.సి.ఆ అని" తడుముకుంటూ జీరపోయిన కంఠంతో అన్నాను ఆమె చేతిలోని ఇంగ్లీషు పత్రిక చూస్తూ.

"ఒరే, నాగూ. వేణ్ణీళ్లు సిద్ధంగా ఉన్నాయి. బాగా అలసిపోయి ఉంటావు. స్నానానికి లేచి రా. తరవాత మాట్లాడుకోవచ్చు" అంటూ హాల్లోకి ప్రవేశించిన అత్తయ్యను చూసి బ్రతికానురా భగవంతుడా అనుకుంటూ లేచి వెళ్లాను.

అత్తయ్య ఇంట్లో నేను గడిపిన ఆ రెండు నెలల కాలంలోనూ మల్లి నాకు చాలా సన్నిహితురాలైంది. అందుకు కారణం మా ఇద్దరి మధ్యా ఉన్న బంధుత్వమో, లేక నేనంటే మల్లికి ఏర్పడిన గౌరవమో అయి ఉండవచ్చు.

ఆ సాయంత్రం పెన్న ఒడ్డున కూర్చున్నాము. నేనూ, మల్లీ. వెన్నెల్లో ఇసకంతా తెల్లగా మెరుస్తూంది. చల్లని పిల్లగాలులు మనస్సుకూ, శరీరానికీ గిలిగింతలు పెడుతున్నాయి.

"బావా, నీ కథలు చదువుతూంటే నువ్వు సృష్టించే పాత్రల్లో వాస్తవికత, సహజత్వము లోపిస్తున్నాయేమో ననిపిస్తుంది" అంటూ సంభాషణ ప్రారంభించింది మల్లి.

నేను చిన్నగా నవ్వి ఊరుకున్నాను. నా కథలపై ఈ అభిప్రాయాన్ని ఇదివరకు ఎందరో ఎన్నిసార్లో వెలిబుచ్చి ఉన్నారు. అందరికీ అన్నిసార్లూ సమాధానం ఇచ్చి ఉన్నాను కూడా. పదే పదే అదే చెప్పడం విసుగనిపించింది. అందుకే ఈమధ్య నా కథలను ఎవరే విధంగా విమర్శించినా విని మెల్లిగా నవ్వేస్తూంటాను.

"ఈ వారం నువ్వు వ్రాసిన కథ చదివాను. అందులో భాస్కరం పాత్ర మరీ అసహజంగా ఉంది. ఆ పరిస్థితులలో ఎవరూ అలా ప్రవర్తించరు" అని, "ఏం, బావా, పలకవేం?" అంటూ నా వేపు తిరిగింది మల్లి.

"నీ అభిప్రాయమేమిటో పూర్తిగా చెప్పి ముగించు" అన్నాను ఇసకలో పిచ్చి గీతలు గీస్తూ.

"తన భార్య వివాహానికి పూర్వం ఒక యువకుణ్ణి ప్రేమించి అతనికి తన సర్వస్వం అర్పించిందని తెలుసుకున్నాడు భాస్కరం. అదొక సర్వసాధారణ విషయంగా, దాని కే మాత్రమూ ప్రాముఖ్యం ఇవ్వకుండా ప్రవర్తించినట్లు చిత్రించావు. మనిషి అంతర్యంలో ఏ మూలైనా కించిత్తు ద్వేషమూ, మోసపోయాననే బాధా కలగడం మానవ సహజం. కాని, అది కూడా అతనిలో కలగలేదని చెపుతూ అతనలా ప్రవర్తించడంలో గల ఔన్నత్యాన్నీ ఔదార్యాన్నీ పొగిడావు. అతన్ని ఒక అభ్యుదయవాదిగా, మహోత్తమ సంస్కారిగా చిత్రించడానికి ప్రయత్నించావు. కాని, నేను మాత్రం భాస్కరం వట్టి పిరికివాడు అని మాత్రమే అంటాను. రెండు మూడు మాటల పరిచయంతోనే ఆమెను వివాహం చేసుకోడానికి సిద్ధపడిన అతని అజ్ఞానమూ, మూర్ఖత్వమూ గుర్తించి, తన బలహీనత కప్పిపుచ్చుకోవడానికి అలా ప్రవర్తించాడనే గాని అందులో అతని గొప్పతనమేమీ లేదని అనుకున్నాను."

ఇక నేను మాట్లాడకపోతే మల్లికి చిర్రున కోపం వస్తుంది.

"మన చుట్టూ ఉన్నదే ప్రపంచం కాదు. ఎందరో వ్యక్తులు, ఎన్నో విభిన్న మనస్తత్వాలు. అందులో భాస్కరం లాంటి వ్యక్తులు కొందరు ఉండకూడదా?"

"అలాంటి మనస్తత్వం ఉన్నవాళ్ల నెవరినైనా నువ్వె రుగుదువా?"

"లేదు. కాని, మన ఊహల స్వరూపాన్ని ప్రత్యక్షంగా మనం చూడలేకపోయినంత మాత్రాన ఆ ఊహలకు అసలు రూపమే ఉండదనుకోవడంకూడా పొరపాటు. సారూప్యం లేని ఊహలను అసలు మనిషి కల్పించు కోలేడు కూడా."

"పోనీ, ఎవరిదాకానో ఎందుకులే, బావా! ఇన్ని భావాలనూ, భిన్నతత్త్వాలనూ సృష్టిస్తావు కదా, నువ్వే చెప్పు, భాస్కరం పరిస్థితులలో నువ్వే అయితే ఏం చేసేవాడివి? అలాగే ప్రవర్తిస్తావా?" కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగింది మల్లి.

నేను కొన్నినిమిషాలపాటు మాట్లాడలేకపోయాను.

ప్రపంచ సాహితీవేత్తలను అనాది నుంచీ ఎదుర్కొంటున్న ప్రశ్న! వారి అంతర్యాలలో రేగిన ఈ ప్రశ్నకు సరియైన సమాధానం చెప్పకోగలిగిన మహానుభావులు వారిలో ఏ బహుకొద్ది మందో. అటువంటప్పుడు సామాన్య కథా రచయితనైన నాకు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పకోగల శక్తి ఏపాటిది?

"చెప్పలేను. సృష్టించడం వేరు. దానికి అనుగుణంగా జీవించడం వేరు. మహోత్తమ పాత్ర సృష్టి చేయగలిగిన రచయిత తన జీవితాన్ని అంత ఉత్కృష్టంగానూ మలుచుకోవడం అసాధ్యం. కాని, దాన్ని సుగమం చేసుకోగలిగిననాడు అతడు నిజంగా ధన్యుడే అవుతాడు. అయినా నువ్వు చెప్పిన ఆ పరిస్థితులు తటస్థపడకముందే అప్పుడెలా ప్రవర్తిస్తానో ఇప్పుడెలా చెప్పగలను? మనిషి మనస్సు ఎప్పుడే విధంగా ఆలోచిస్తుందో చెప్పడం అంత సులువు కాదు" అన్నాను.

తాలూకా ఆఫీసులో ఎనిమిది గంటలు కొట్టారు. ఇసుకలోంచి లేచి ఇద్దరం ఇంటి ముఖం పట్టాము.

ఆ మరునాటి రోజే మద్రాసు తిరిగి వచ్చాను.

నా కిప్పుడొక చిక్కు సమస్య ఎదురైంది. పదేళ్ల క్రితం జీవితంలో ఏకాకిగా మిగిలిపోతానేమోనని భయపడిన నేను ఇప్పుడు నా జీవిత భాగస్వామినిగా ఇద్దరిలో ఎవరిని ఎన్నుకోవాలో తెలియని సందిగ్ధతలో పడ్డాను. తల్లిగా ఆదరించిన అత్తయ్య కూతురు మల్లి ఒకవేపు. పదేళ్ల క్రితం మద్రాసు నగర వీధుల్లో దిక్కు తోచక బతుకుతెరువు కోసం అల్లాడిపోతున్న రోజుల్లో నన్ను ఆదరించి, నాలో అంతర్గతంగా దాగి ఉన్న రచనాశక్తికి అవకాశాలు కల్పించి, నన్నొక రచయితగా ఆంధ్రలోకానికి పరిచయం చేసి, నా బతుకుబాట సుగమం గావించిన సహాయ సంపాదకుని కూతురు స్వాతి ఒకవేపు. ఇద్దరూ నన్ను ప్రేమిస్తున్నారు. గౌరవిస్తున్నారు. అందుకే "ముహూర్తం ఎప్పుడు పెట్టుకోమంటావు?" అని అత్తయ్య ఉత్తరం వ్రాసినా సమాధానం ఇవ్వకుండా ఊరుకున్నాను.

ఆ రోజు నా కో ఉత్తరం వచ్చింది. మళ్లీ అత్తయ్యే వ్రాసి ఉంటుందనుకుని విప్పి చదివాను.

"నాగేశ్వరరావు గారికి,

నేను మీ అభిమాన పాఠకుల్లో ఒకణ్ణి. అందుకే మీ శ్రేయోభిలాషిని కూడా. మీరు మల్లిని వివాహం చేసుకోబోతున్నారని తెలిసింది. మీరు ఉత్తమ రచయితలు; వివాహం అత్యంత ప్రధానమైన జీవిత సమస్య. అందులో మీరు తప్పటడుగు వేశారంటే ఆ తరవాత మీ పొరపాటు గ్రహింపుకు వచ్చినప్పుడు మీ వ్యక్తిత్వం దెబ్బ తింటుంది. మీ సృజనాత్మక శక్తికే అది

ముప్పు తీసుకురావచ్చు. అందుకే ముందుగా ఈ హెచ్చరిక. మల్లి మీ రనుకున్నంత అమాయకురాలు కాదు. అవధులు దాటిన ఆమె పెంకితనం, జీవితాన్ని బొమ్మలాటగా భావించిన ఆమె కొంటె స్వభావం ఆమెను 'అతనికి' లొంగేలా చేసింది. అతని మాయలోపడి మోసపోయింది మల్లి.

ఆ తరవాత ఆమెకు గర్భం రావడం, అది తీయించేసుకోవడం కూడా జరిగిందంటారు కొంత మంది. ఇదంతా జరిగి సంవత్సరం కూడా కాలేదు. మీరు చాలాకాలంగా మద్రాసులో ఉంటున్నారని తెలిసి కూడా ఇంతకాలంగా మీ విషయమై శ్రద్ధ తీసుకోని మీ అత్తగారు పని కట్టుకుని ఇప్పుడు మీపై అభిమానాన్ని కురిపించడం ఎందుకనుకున్నారు? మల్లిని మీకు అంటగట్టాలని. ఇంతకంటే మీకు నేనేం చెప్పగలను? ఏమి నిర్ణయించుకోవాలో మీకు తెలిసే ఉంటుంది.''

ఉత్తరం చదవడం ముగించిన నాకు ఒళ్లంతా చెమటలు పట్టింది. కిటికీ గుండా వీచిన గాలికి చేతిలోని ఉత్తరం రెపరెపలాడింది. ఉత్తరం కింద సంతకంలేదు. కవరు మీది పోస్టు ముద్రలు చూశాను. నెల్లూరులో పోస్టు చెయ్యబడింది. ఆ క్షణంలో నాలో ఎన్నో ఆలోచనలు గజిబిజిగా తిరిగాయి. పొందికలేని సంఘర్షణ. ఏదో అయోమయ పరిస్థితి. ఆ రోజున పెన్న ఒడ్డున మల్లి నాతో వాదించిన సంఘటన కళ్ల ముందు కదిలి నన్ను వెక్కిరించినట్లైంది. ఇదన్న మాట ఆనాటి వాదన వెనక దాగిన అంతరార్థం! అయితే ఈ ఉత్తరం? నిజం కాకపోవచ్చు. కేవలం ఈ ఉత్తరాన్ని ఆధారంగా తీసుకుని మల్లికి కళంకాన్ని ఆపాదించడం న్యాయం కాదు. కాని సందేహమంటూ ఏర్పడిన తరవాత, ఆ సందేహంతో మల్లిని స్వీకరించ డానికంటె తన్ను మనసారా ప్రేమిస్తున్న స్వాతిని వివాహం చేసుకుంటే? అవును. అదే ఉచితం. తద్వారా తన్ను చేరదీసి ఆదరించిన ఆమె తండ్రి పార్వతీశంగారికి కూడా సంతోషాన్ని కలిగించి నట్లవుతుంది.

''హల్లో, రావుగారూ!'' అంటూ స్వాతి ప్రవేశించ డంతో మళ్లీ పరిసరాలను గుర్తించ గలిగాను.

''ఏమిటి, రావుగారూ, ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్లు న్నారే?'' అంది స్వాతి వచ్చి కుర్చీలో కూర్చుంటూ.

''అబ్బే! ఏంలేదు'' అన్నాను ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుంటూ.

''ఈసారి పోటీకి కథలు వెయ్యికి పైనే వచ్చా యండీ. పరిశీలన ప్రారంభిద్దామంటారా?'' అంది స్వాతి.

''ఊ'' అని మాత్రం అన్నాను పరధ్యానంగా.

ఆఫీసుబాయ్‌ని పిలిచి కథలకట్ట తీసుకు రమ్మంది.

''ఈ రోజు మీరు అదోలా ఉన్నారేమిటి? ఒంట్లో గాని కులాసాగా లేదా? పోనీ, ఈ రోజుకు విశ్రాంతి తీసుకోండి. పరిశీలన రేపు చూసుకుందాం'' అంది స్వాతి నా వేపు పరీక్షగా చూస్తూ.

''చూడు, స్వాతీ! మన వివాహం...'' మధ్యలో నిలిపేశాను.

వింతగా చూసింది స్వాతి నావేపు.

''మీ నాన్నగారితో చెప్పి ముహూర్తం త్వరలో పెట్టించమను.'' నెమ్మదిగా అన్నాను.

స్వాతిని వివాహం చేసుకున్నాక మూడేళ్లు గడిచాయి. జీవితం సాఫీగా సాగిపోతున్నది. ఈ మధ్యకాలంలో నేను చేసిన మోసానికి నన్ను నిందిస్తూ అత్తయ్యా దగ్గరనించి ఒక ఉత్తరం మాత్రం వచ్చింది. దానికి నేనేమీ సమాధానం ఇవ్వలేదు.

* * *

రవీంద్రభారతిలో జరిగిన రచయితల సమావేశా నికి హైదరాబాదు వెళ్లినప్పుడు యాదృచ్ఛికంగా మల్లిని కలుసుకోవడం జరిగింది.

''మల్లీ, బాగున్నావా?'' అంటూ పలకరించాను. ''పెళ్లికి నిన్ను పిలవలేదని నా మీద కోపమా? అనుకోని పరిస్థితుల్లో స్థిరపడింది. అందుకే ఆహ్వానం కూడా పంపలేకపోయాను.''

''ఆ ఆకాశరామన్న ఉత్తరం ఇంకా ఉందా, బావా, నీ దగ్గర?'' మల్లి వేసిన ఆ ప్రశ్నవిని బిత్తరపోయాను.

''మల్లీ! నీ కెలా తెలుసు?''

విషాదంగా నవ్వింది మల్లి.

''ఎలా తెలిస్తేనేంలే, బావా, అంతా అయిపోయిం తరవాత! ఆ ఉత్తరాన్ని అప్పుడే చింపేశావా?'' ఆమె కంఠంలో ఏ మూలో కొంత బాధ ధ్వనించింది.

''ఆ ఉత్తరం ఇంకా నా దగ్గిరే ఉంది. చింపెయ్యా లేదు.. మల్లీ నీతో...'' అంటూనే వున్నాను. నా మాటల్ని మధ్యలో తుంచి, ''వస్తాను, బావా. ఆఫీసుకు టైమైంది!'' అంటూ అప్పుడే వచ్చి నిలిచిన బస్సులో ఎక్కి వెళ్లిపోయింది మల్లి.

మద్రాసుకు తిరిగి వచ్చాను.

వారం రోజులకు మల్లి దగ్గరనించి ఉత్తరం వచ్చింది.

''బావా!

ఆనాడు పెన్న ఒడ్డున నీ కథలనూ, పాత్రలనూ విమర్శిస్తూ వాదించాను, జ్ఞాపకం ఉంది కదూ? నీ నిజాయితీని, వ్యక్తిత్వాన్ని పరీక్షించాలని ఓ చిలిపి కోరిక నాలో ఉదయించింది ఆనాడు. నేను భర్తగా పొందబోయే బావ — ప్రఖ్యాత కథా రచయిత — మనస్తత్వాన్ని పరీక్షించాలనే సంబరం కలిగింది. అది ఒక తమాషాగా మాత్రమే అనిపించింది అప్పట్లో. బహుశః అది నాలోని అహంకారం కావచ్చు. అజ్ఞానం కూడానేమో! కాని, నేను కల్పించిన ఆ పరీక్ష నా జీవితానికే అగ్నిపరీక్షగా పరిణమించిందని గ్రహించే నరికి అంతా మించిపోయింది. కత్తి మీద సాము చేశాను. కాని, గాయాలు తగలకుండా మాత్రం తప్పించుకోలేకపోయాను.

మూడేళ్ల క్రితం స్వాతిని వివాహం చేసుకోబోయే ముందు నీకు వచ్చిన ఆకాశరామన్న ఉత్తరాన్ని నేను వ్రాస్తున్న ఈ ఉత్తరంతో పోల్చి చూడు.

—మల్లి.''

భద్రంగా దాచి ఉంచిన నా పర్సనల్ ఫైల్లోంచి ఆ ఉత్తరం తీసి చూశాను. ఆశ్చర్యం! నా కళ్లను నేనే నమ్మలేకపోయాను! రెండు ఉత్తరాల్లోనూ వ్రాత ఒక్కలాగే ఉంది. రెండూ ఒకరు వ్రాసినవేనని స్పష్టంగా గోచరిస్తున్నది.

కిటికీ గుండా చల్లగా పిల్లగాలి వీచింది.

టేబిల్ మీద ఆ రెండు ఉత్తరాలూ నన్ను చూసి నవ్వుతున్నాయి.

□



## తిరువనంతపురం సదస్సులో ఇద్దరు తెలుగు వనితలు

తిరువనంతపురంలో డిసెంబరు నెల 9 నుంచి 11 వ తేదీవరకు మిత్రా నికేతన్‌లో జరిగిన అఖిల భారత విద్యా వైజ్ఞానిక పరిశోధనా సంస్థ నిర్వహించిన సెమినార్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇరువురు ఉపాధ్యాయినులు హాజరైనారు. వారిలో ఒకరు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పురపాలక సంఘం పాఠశాల ఉపాధ్యాయిని శ్రీమతి యార్లగడ్డ వసుంధరాదేవి, రెండవ వారు సిర్పూర్ కాగజ్ నగర్‌కు చెందిన శ్రీమతి ప్రదా వతి రావు- ఈమె కాజగ్ నగర్‌లో నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

ఈ సమావేశానికి 13 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరు కాగా దక్షిణ భారతదేశం నుంచి నలుగురు మహిళలు హాజరైనారు వారిలో తమిళనాడు నుంచి ఒకరు. గోవా లక్ష ద్వీప్‌ల నుంచి ఒకరు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇరువురు హాజరైనారు.

ఈ సమావేశాలను కేరళ రాష్ట్ర గవర్నర్ శ్రీ రాచయ్య ప్రారంభించారు అఖిల భారత విద్యా విజ్ఞాన పరిశోధనా సంస్థ డైరెక్టర్ అరుణ్‌కుమార్ మిశ్రా (ఢిల్లీ), నేషనల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ఆఫీసరు శ్రీ ఎ.పి. వర్మ (న్యూ ఢిల్లీ)లు తదుపరి సదస్సును నిర్వహించారు.

శ్రీమతి ప్రద్మావతి- 'దేవదాసీలు వారి స్థితి గతులు' వారి అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు గురించి థీసెస్ సమర్పించారు.

శ్రీమతి వసుంధర - 'తక్కువ ఖర్చుతో నిరుపయోగ వస్తువులతో గృహాలంకరణ' అన్న అంశం గురించిన వివరాలు సభలో తెలిపారు.

ఎల్. వెంకటరత్నం